# నీటి మబ్బు

సుచిత్ర పెళ్ళికి నెల్లూరు వెళ్ళాను. మా బ్రహ్మానందం బాబాయి రెండో కూతురు సుచిత్ర.

మధ్యాహ్నం వచ్చిన బంధువులందరికీ మా సీత 'అసహ్యాప్పనులు' నచ్చలేదు. సీత చర్చే కాఫీ పలహారాలయినై.

'సీతేమీ అమాయకప్పీనుగ కాదు. కిందటేడాది ఈ బ్రహ్మానందం పెద్దకూతురి పెళ్ళికి వాలిపోయి అంతా తానే అయి ఎన్ని పనులూ చేసింది. బాగానే లాగిందిట.' సంభాషణకి తెరతీసింది మా పూర్ణత్త. ఆమెకి డెబ్బై ఏళ్ళు. పెద్ద వ్యవహర్తగామా బలగంలో పేరుంది.

'ఎక్కడ ఏ శుభం జరిగినా, అశుభం కలిగినా సీత ప్రత్యక్షమయ్యేది అందుకేగా. దక్కినమ్మకు బొక్కినంత' మా చిన్నత్త శాంత విలువైన అభిప్రాయం.

'సీత డబ్బుమనిషి కాదులేవే. ఏదో బంధుప్రీతి. ఉపకారగుణం' సుభద్రత్త.

నెమ్మదిగా వీళ్ళందరి మధ్యకీ వచ్చింది సావిత్రి. ఆమె పూర్ణత్త పెద్దకూతురు. రహస్యం చెప్తున్నట్టు సన్నగా మాటల్ని వదిలింది. 'ఈ మధ్య సీత బయట వంట పనులకీ పోతున్నదిటలేవే'

'ముగ్గురు ఆడపిల్లలు. ఆ మొగుడికి ఏదో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో ఉద్యోగం. చాలీ చాలని జీతం' జాలి పడింది శాంతత్త. ఈ మాటలంటూ ఎందుకో నాకేసి అదోలా చూసిందామె. నాకు కొంచెం ఇబ్బందనిపించింది. సీత మా పెద్దమ్మ కూతురు మరి! పరధ్యాన్నంగా ఉన్నవాడిలా నటిస్తూ, లేచి దూరంగా ఉన్న కుర్చీకి మారాను.

నా కళ్ళముందు సీత బొమ్మమెదిలింది.

పెదనాన్న చనిపోయిన కొత్తల్లో తెనాలి వెళ్ళాను. ఓరోజు సాయంత్రం 'అన్నయ్యా నే చదువుకుంటూ అమ్మకు చెప్పు' అని అడిగింది సీత. విని వూరుకున్నాను. రెండోరోజు

రెండుసార్లు గుర్తుచేసింది. అయినా పెద్దమ్మ ముందు నేనా ప్రసక్తి తేలేదు. ఆమె తాహతూ, డబ్బు సమస్యలూ నాకు తెలుసు.

మూడో రోజు రాత్రి –

అన్నాలయినై వరండాలో పడుకుని వున్నాను. పెద్దమ్మ లోపల భోంచేస్తుంది. సీత వచ్చి పక్కగా నిలబడింది. అయితే చెప్పవా? అన్నది. నేను మంచం మీదలేచి కూర్చున్నాను. ఆమె వైపు తేరిపార చూశాను.

సీత కళ్ళల్లో నీళ్ళు! కొద్దిసేపు ఏదో బోలు మాటలు చెప్పి సముదాయించాను. 'పెద్దమ్మకి కష్టమవుతోంది. ఏదో ఉన్న నాలుగు గేదెల పాడితో కాలం నెట్టుకొస్తోంది. చదువంటే మాటలా? అని కొద్దిసేపు ఆగిచెప్పాను. అయితే ఒక పని చేద్దాం. కాలేజీలో చేరు. ఫీజులూ అవీ నేను చూసుకుంటాను. నీ చదువైన తర్వాతే నా పెళ్ళిగురించి ఆలోచిస్తాను. అమ్మా నాన్నకి చెప్తాను. లేదా నువ్ హైదరాబాదొచ్చి మాతో వుండు.

మొదటి సలహాకి నేనొప్పుకోను. రెండో సలహాకి అమ్మ వొప్పుకోదు. కుదరని బేరమేలే ఇదంతా' అని ఠక్కున వెళ్ళిపోయింది. అభిమానం కల పిల్ల – సీత!

ప్రత్యేకమైన సంభవాలేమీ లేకుండానే నేను తిరుగుప్రయాణమయ్యాను. రెండేళ్ళు ఇట్టే గడిచి పోయాయి.

ఆ వేసవిలో సత్యంతో సీత పెళ్ళి జరిగింది. ఆమె పెళ్ళి గురించి నలుగురే నాలుగు మాటలనుకున్నారు. కాలువంకరవాణ్ణి కావాలని చేసుకుందని కొందరంటే, కాదుటలే, వాళ్లిద్దరికీ రెండేళ్ళనుంచీ 'ఇదే టలే' అని కొన్ని నరంలేని నాలుకలు గుసగుసలాడాయి. సత్యమూ సీతామాత్రం పాలూ నీళ్ళలా కలిసిపోయారు.

సత్యంకి విజయవాడలో ట్రాన్స్‌పోర్టు కంపెనీలో చిన్న ఉద్యోగం. వాళ్ళకి మొదటిపిల్ల పుట్టిన తర్వాత పెద్దమ్మ చనిపోయింది.

నేను కొచ్చిన్‌లో ఉద్యోగంలో వున్నాను. విజయవాడ వెళ్ళలేదు.

చాలాకాలం తర్వాత.

ఒకసారి కొచ్చిన్ నుంచీ హైదరాబాద్‌వెళ్తూ, సీతనీ, సత్యంనీ పిల్లల్నీ చూసి పోదామని విజయవాడలో ఆగేను.

సూర్యారావుపేటలో ఇల్లు కనుక్కుని వెళ్ళే సరికీ రాత్రి ఎనిమిది గంటలైంది. సత్యం ఇంట్లోనే ఉన్నాడు. ముగ్గురు పిల్లలు అన్నాలు తింటున్నారు. సీత యింట్లో లేదు. ఆమె పరచయస్తురాలి భర్త యాక్సిడెంట్‌లో పోయాడట. ఆ వేల్టికి పదోరోజు. కర్మాంతరాలు ఏలూరులో జరుపుతుంటే వాళ్ళకి సహాయం కోసం అక్కడికి వెళ్ళింది. మూడురోజుల దాకా రాదు. ఇదీ వార్త.

సీత ఉపకార చింతనకూ, సేవాభావానికంటే, సత్యం ఓర్పూ, సహనానికీ, భార్యకి అతనందించే సహకారానికీ చాలా ఆశ్చర్యపోయాన్నేను.

స్వచ్ఛమైన మనసూ, ఉన్నతమైన లక్ష్యం - ఎప్పుడూ - ఇలాంటి త్యాగాన్నే కోరతాయి అనిపించింది.

నాతో మాట్లాడుతూనే - నా కోసం క్షణాల్లో అన్నం వండేశాడు సత్యం. పిల్లలంతా ముంగిట ముత్యాల్లా వున్నారు. మాటలు కలిపి ఎవరో ఏమిటో తెలుసుకుని - తమ చదువుల గురించీ చెప్పుకుంటూ కూర్చున్నారు. పెద్దపిల్ల సుజాత - ఎనిమిదేళ్ళది. తండ్రికి బాగానే చేయందిస్తోంది. చూస్తుంటే ముచ్చటేసింది.

నేను తీసుకువెళ్ళిన స్వీట్లూ, పళ్ళూ, కొత్తగుడ్డలూ ఇచ్చాను. సత్యం మొహమాటపడ్డాడు. అయితే, అతని కళ్ళల్లో మెరుపు.

నేనూ సత్యమూ కబుర్లతో కలిపి భోజనమూ చేశాము. 'మూడు గదుల రైలుపెట్టె లాంటి ఇల్లే గానీ, సౌకర్యంగానే ఉంది' అని నొచ్చుకుంటూ అన్నాడు సత్యం- ముందు గదిలో నాకొక ప్లాస్టిక్ నవారు మంచం అమరుస్తూ. 'అవును బాగుంది' అన్నాను.

'ఉన్నంతలో మీరు జీవితాన్ని అర్థవంతంగా గుడుపుతున్నారు. అన్నాను మెచ్చుకోలుగా.

'నాదేంవుంది బావా. అంతా మీ సీత ఘనతే. వెనకా ముందూ ఎవరూలేని వాణ్ణి. తాడూ బొంగరమూ లేనివాణ్ణి నన్ను కావాలని చేసుకుంది. తన అభిప్రాయాలు తనవి. నలుగురికి సహాయపడుతుంది. మళ్లీ నిక్కచ్చిగానూ ఉంటుంది. కుట్లూ అల్లికలూ వంటిచిన్నా చితకా పనులతోనూ అంతో ఇంతో సంపాదిస్తుంది. ఇటు పిల్లల్నీ నన్నూ శ్రద్ధగా చూసుకుంటుంది' అన్నాడు సత్యం.

భార్య పట్ల సత్యం ప్రేమనీ, ఆరాధనా భావాన్నీ అర్థం చేసుకున్నాను. నా ఆలోచనలో నేనుండగానే, మనసులోని అనురాగాన్ని రాశిచేస్తూ 'పిచ్చిపిల్ల. నేనంటే ఎంత ప్రేమో!' అని అననూ అన్నాడు. సత్యం ఎంతగా ముగ్ధడవు తున్నాడో కూడా అర్థమైంది నాకు. సీత అదృష్టవంతురాలు!

తెల్లవారుతూనే నేను హైద్రాబాద్ వెళ్ళిపోయాను. మళ్ళీ యిన్నాళ్ళకి వాళ్ళని ఈ పెళ్ళిలో చూడగలననే ఆశతోనే వచ్చాను.

–పక్కకి ఎవరో వచ్చి నిలబడినట్లయి ఉలిక్కిపడ్డాను. ఆలోచన తెగింది. తలతిప్పి చూస్తే – సత్యం!

ఆశ్చర్యం! ఆనందం!

యోగక్షేమాలు విచారించడం, పలకరింపులూ సాగిన్నై;

బ్రహ్మానందం బాబాయి వచ్చి చేరాడు.

సీతలేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది సత్యం. ముఖ్యంగా ఆ కిచెన్ గొడవేదో తాను చూసుకొనేది. క్రితం సారి అన్నీ తానే నిభాయించుకొచ్చింది. పిచ్చిపిల్ల. దానికి బంధుప్రీతి ఎక్కువ'.

ఆడవారంతా మొహమొహాలు చూసుకున్నారు. మా పూర్ణత్త అన్నది వెటకారంగా 'బంధుప్రీతితో పాటు ఇతర లాభాలు ఉంటయ్‌గా తమ్ముడూ!' అని.

బ్రహ్మానందం బాబాయి విస్తుపోయాడు. అక్కవైపు చూస్తూ 'ఒక్కమాట చెప్తా విను. పదిరోజులుండి వాళ్ళు హూనం చేసుకున్న పిల్ల – పసుపుకుంకుమ తప్ప ఏమీ తీసుకోలేదు. నీకేం తెలుసక్కా – సీత మంచిదనం?" అన్నాడు. పూర్ణత్త ఇబ్బంది పడింది. మొహం వెలవెలబోయింది. మిగిలినవారికీ పచ్చి వెలక్కాయ గొంతున పడింది.

వాతావరణం గంభీరంగా మారింది. నా మనసుకు హాయి అనిపించింది.

సీత ఈ పెళ్ళికి రాని కారణం తెలిసిందానిమీదట చంద్రం భార్య సరళ ఆస్పత్రి పాలయితే – విజయవాడలో ఆమెకు సేవలు చేయటంలో సతమతమవుతోందిట!'

– పెళ్ళి అయిపోయి ఎటువారటు కదులుతున్నారు. నేనూ బాబాయికి చెప్పి ప్రయాణమైనాను. సత్యం నా పక్కనే వున్నాడు. అయితే, మీ సీతను చూడకుండానే వెళ్తావా'. అని నిష్ఠూరమాడాడు. నేనూ అతనితో బయలుదేరాను.

బస్‌లో చెప్పాడు సత్యం. సరళావాళ్ళు తిరుపతి వెళ్తున్న టూరిస్ట్ బస్ పెద్ద లోయలో పడిపోయింది. ఇరవైరెండుమంది చనిపోయారు. పదిహేను మందికి గాయాలయినై. సరళకి మరీ తీవ్రమైన గాయాలైనై. నెలనుంచీ హాస్పటల్‌లో వుంది.

చంద్రం గురించీ చెప్పుకున్నాం. చంద్రం, నేనూ, సత్యం ముగ్గురమూ బాల్యమిత్రులం. అంటుకొమ్మల్లా ఉండేవాళ్ళం.

చంద్రం డిగ్రీ పాసయి, టెలిఫోన్స్‌లో చేరాడు.

–సరాసరి హాస్పటల్‌కి వెళ్ళాం. సింగిల్ రూమ్‌లో సరళ. పక్కగా స్టూలుమీద చంద్రం. మమ్మల్ని చూడగానే అతని కళ్ళల్లో సంతోషం మెరిసింది. చేయి కలిపాడు.

శరీరమంతా బ్యాండేజీతో సరళ. బాధ కలిగింది. మొహం మాత్రం కనిపిస్తోంది. కళ్ళల్లో వెలుగు. ఆమెను చూసీ చూడగానే ఆ దుర్ఘటన తీవ్రత అర్థమయిందినాకు. చంద్రమూ వివరించాడు. 'మల్టిపుల్ ఫ్రాక్చర్స్. నాలుగు ఆపరేషన్లు జరిగినై. ఇంకా రెండు చెయ్యాలిట. పాదానికి తొడలో చర్మమూ, కండతీసి గ్రాఫ్టింగ్ చేయాలి. పాదం నజ్జు నజ్జు అయింది.

ఆ గాథంతా వింటే మనసు కలత చెందింది. ఊరడింపుగ 'గాడ్ ఈజ్ గ్రేట్' అని భుజం తట్టాను. ఆదలావుంచు. ఈ ఉచ్చనీచాల్ని భరిస్తూ, సరళకి సీత చేస్తున్న సేవ నిజంగా గ్రేట్. ఏ నాడో గొప్ప పుణ్యం చేసుకుపుట్టింది సరళ' అన్నాడు చంద్రం. భర్తమాటలతో సరళ 'బ్రేక్' అయింది. 'అవును. సీత నా పాలిట దేవతే. అన్నీ మంచంలోనే నాయో. అడవిలో మొద్దులా పడుంటిని. పగవారికి కూడా వద్దీ దుర్గతి.'

సరళ కంఠం రుద్దమైంది. ఏడ్చేసింది.

ఇదిగో ఈ పొగడ్తలూ, ఏడుపులే వద్దనేది' అంటూ రానే వచ్చింది సీత.

విశేషాలూ, పెళ్ళి విశేషాలూ మాట్లాడుకున్నాం.

ఆ సాయంత్రం నేను హైదరాబాద్ వెళ్ళిపోయాను.

మూడునెలల తర్వాత, చంద్రంఫోన్ చేసి చెప్పాడు – సరళ కొద్ది అడుగులు వేయగలుగుతోందనీ, పాదాల్లో ఇంకా పూర్తి సత్తువ రాలేదనీ, ఇంటికి తీసుకొచ్చినా, ఇంకా సీత వచ్చి జాగ్రత్తగాచేసుకుంటోందనీ, సీతకి మాత్రం తానేమీ చేయలేకపోతున్నామనీను. నాకు మా మేనత్తల మాటలు గుర్తుకొచ్చాయి. వాళ్ళ స్వభావాల్ని వింగడించుకున్నాను. సీతపట్ల గౌరవభావం ఇంకా పెరిగింది.

కాలం గడుస్తోంది.

హైదరాబాద్‌లో ఓ పెళ్ళి కార్యక్రమంలో సావిత్రి కలిసింది. బఫే దగ్గర చెప్పుకొచ్చింది "మీ సీత పక్కా బిజినెస్ వుమెన్ అయింది బావా. శాంత పిన్ని తన కూతురు ప్రసవం టైముకి వచ్చి హెల్ప్ చెయ్యమంటే– రానని ఖరాఖండీగా చెప్పిందట సీత; అప్పటికీ తాను బాగానే ముట్టచెప్తాననీ బయటపడిందిట పిన్ని. అయినా రాలేదుట. సీతకి బంధుప్రీతి అంటే ఎట్లా నమ్ముతాం చెప్పు?' అని ప్రశ్నించింది. ఏమోలే. సీత కష్టాలు సీతవి' అని నవ్వి ఊరుకున్నాను. మొహం అదోలా పెట్టి వెళ్ళిపోయింది.

నాకు ఆశ్చర్యమేసింది. వీళ్ళంతా ఇలా మాట్లాడడానికి కారణాలేమిటి? సీత సత్యం భార్య కావటమా. వాళ్ళ పేదరికాన్ని ఆసరాగా తీసుకుని కథలుచెప్పుకుని తమ వైకేరియస్ ప్లెజర్'ని సంతృప్తి పరచుకోవటమా? సీత చేసే సహాయానికీ డబ్బుకీ లంకె పెట్టి ఆనందించటమా? కాక, ఈ రోజుల్లో ప్రతిఫలం లేకుండా ఎవ్వరూ, ఎవ్వరికీ, ఏ కష్టంలోనూ, నిస్వార్థంగా తోడ్పడరనే తమ నమ్మకాన్ని నలుగురికి పంచాలనే తాపత్రయమా?

అనేక ప్రశ్నలు నా మేధని కుదిపేసినై.

ఇది జరిగిన చాలా కాలానికి, ఒకరోజు సాయంత్రం యాదృచ్ఛికంగా మా పూర్ణత్త మనవడు ఫణి కలిశాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు.

మా వాళ్ళందరి యోగ క్షేమాలూ చిన్న 'సమీక్ష' చేశాము. ఫణిచెప్పిన వాస్తవాలు నన్ను విభ్రమలో ముంచాయి. మా పూర్ణత్త పక్షవాతంతో మంచానపడింది. సావిత్రీ వాళ్ళు ఉండేది మియాపూర్; వాళ్ళాయనకి సూపర్ మార్కెట్ ఉంది. నా సహాయాన్ని ఆశించవద్దని చెప్పిందిట. ఫణి వాళ్ళ అమ్మానాన్నా వుండేది వనస్థలిపురం. వాళ్ళూ పూర్ణత్తని చూసుకోలేమన్నారట. ఈమె తన యింట్లో నుంచీ ఎక్కడికీ కదలనని

భీష్మించుక్కూచుంది. విద్యానగర్ ఆమె నివాసం. ఏకాకి సీత సహాయం చేస్తోందట. సీతా, సత్యం పిల్లలూ – ఈమె కోసం తమ మకాం హైదరాబాద్‌కి మార్చుకున్నారట! నేను ఆశ్చర్యపోయాను.

తర్వాతి వారంలో సీత యింటికి వెళ్ళాను.

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. సత్యం అదే ట్రాన్స్‌పోర్టు కంపెనీలో ఈ వూళ్ళో కుదురుకున్నాడు.

పూర్ణత్త గురించిన మాటలు సాగేయి. 'పూర్ణత్తకి నేనేమీ సర్వీస్ చేయటంలేదు. నెలకు మూడువేలు ఛార్జ్ చేస్తున్నాను. అంది సీత. నేను దిగ్భ్రమకు లోనయ్యాను. తెప్పరిల్లి అడిగాను. 'అదే మిటే?' అని.

సహజమైన మానవ సంబంధాల్లో – ఇప్పుడామె వున్న పరిస్థితిలో చిటికెడు జాలి కావాలి. ఓదార్పు కావాలి. తోడు నీడా కావాలి. మనసావాచా కర్మణా సహాయపడే మనిషి కావాలి. అవన్నీ అందిస్తున్నాను నేను. కానీ – వేతనానికి! ఎందుకంటే, ఆమె నా శ్రమ విలువనీ, ఉపకారం ఔన్నత్యాన్నీ డబ్బు రూపేణా మాత్రమే అర్థం చేసుకోగలదు. ఆమె ఏమీ సరళ కాదు!' అన్నది. సీత నీటిమబ్బు, ఎప్పుడు ఎప్పుడు కురవదో తేలిగ్గా తెలియదు అనిపించింది.

డబ్బిచ్చి పని చేయించుకోవటం, డబ్బు తీసుకుని పని చేయటం... సాధారణంగా, సామాన్యాంశాలుగా నిత్యమూ కనిపించే వ్యవహారాలు...! కానీ వీటి వెనుక ఎన్నో రహస్యాలున్నై!

లోకంలో నాలాంటి వాళ్ళు గ్రహించాల్సిన జ్ఞానం ఇంకా చాలా ఉంది!

**–చినుకు మాసపత్రిక, జూన్ 2010**